
ఆంధ్రజ్యోతి

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.7, కనిష్ఠం 10.0



కామారెడ్డి
జిల్లా వార్తలు

5

మంగళవారం 7 జనవరి 2025

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి

దోమకొండ, జనవరి6 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని దోమకొండ ఏవో మణిదీపిక, బీబీపేట ఏఈవో రాఘవేంద్ర రైతులకు సూచించారు. సోమవారం ఆయా మండలాల్లోని వరి పంటలను రైతులతో కలసి పరిశీలించారు. కొందరు రైతులు వరినాటు వేసి 20రోజులు అయిందని, ఆకు చుట్టూ పురుగు (పచ్చపురుగు) ఉధృతి ఉందని, మరికొన్ని రోజుల్లో మోగి పురుగు లక్షణాలు కనిపిస్తే మందుల పిచికారీకి అధికారులను సంప్రదించాలని సూచించారు. నాటు వేసిన 25 రోజులకు యూరియా, పొటాష్, మోతాదులో వాడాలని చెప్పారు.



'ఉపాధి కల్పన'లో అవకతవకలు!

- 'పైసలిస్తేనే పోస్టులు' అనే ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన
- కలెక్టర్‌ను కలిసి విచారణ చేపట్టాలని ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల డిమాండ్
- విచారణకు కమిటీ ఏర్పాటు?
- తవ్వేకొద్ది బయటపడుతున్న ఉపాధిశాఖ కార్యాలయ సిబ్బంది లీలలు
- నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీల కేటాయింపు
- ఈపీఎఫ్, ఈఎస్ఐ కట్టని ఏజెన్సీలు
- భారీగా డబ్బులు చేతులుమారడంతో అర్హతలేని ఏజెన్సీలకు అందలం
- కార్యాలయ సిబ్బంది బంధువులు, సన్నిహితులకు పోస్టింగ్‌లు

కామారెడ్డి/కామారెడ్డిటౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత కాలంలో ఉన్నత చదువులు చదివి ఏ ప్రభుత్వ ఉద్యోగం రాకనే.. కుటుంబ సమస్యలతో, ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలో వదిలేసి కుటుంబ భారాన్ని మోసేందుకు ఏదైనా ఉద్యోగం కోసం ఉపాధి కార్యాలయం తలుపుతడుతున్నారు. ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఏదైనా ఉద్యోగ ప్రకటన వచ్చినప్పుడు తమకు అవకాశం రాకపోతుందా అని ఆశపడుతున్న వారికి నిరాశే మిగిలేలా ఆ శాఖలోని కొందరు అధికారులు, సిబ్బంది చేస్తున్నారని విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'పైసలిస్తేనే పోస్టులు' అనే శీర్షకతో ప్రచురితమైన కథనానికి భారీ స్పందన లభించింది. పలు ప్రజా, విద్యార్థి సంఘాలు స్పందించాయి. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన ప్రజావాణిలో జిల్లా ఉపాధికల్పన కార్యాలయ అధికారి, సిబ్బంది పనితీరుపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోరుతూ వినతిపత్రం అందించారు. దీంతో కలెక్టర్ స్పందించి అదనపు కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపట్టినట్లు సమాచారం. అయితే ప్రభుత్వ శాఖలలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల నియామక విషయంలో నిబంధనలకు విరుద్ధంగా పలు ఏజెన్సీల కేటాయింపులు ఆరోపణలు వస్తున్నాయి. ఏజెన్సీల కేటాయింపులో భారీగా డబ్బులు చేతులు మారడంతో అర్హతలేని, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతూ ఈపీఎఫ్, ఈఎస్ఐ కట్టని ఏజెన్సీలకు అందలం ఎక్కించారని విమర్శలు వస్తున్నాయి. ఉపాధి కల్పనశాఖ అధికారులు, సిబ్బంది చేసిన స్వామికార్యానికి పలు పోస్టుల్లో కార్యాలయ సిబ్బందికి చెందిన బంధువుల, సన్నిహితులకు పోస్టింగ్ ఇప్పించుకున్నారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

నిబంధనలకు విరుద్ధంగా ఏజెన్సీల కేటాయింపు

జిల్లా ఉపాధిశాఖ కార్యాలయంలో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని గత కొన్ని సంవత్సరాలుగా విమర్శలు వస్తున్న ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో దృష్టిసారించకపోవడంతో తమకు నచ్చిన విధంగా ఆ శాఖ సిబ్బంది ప్రవర్తిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఆ శాఖాధికారులు ఉద్యోగాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ సమయంలో నిబంధనలు పెడుతున్నారే కానీ వాటి అమలును మాత్రం చేయడం లేదు. ప్రతీ సంవత్సరం ఏజెన్సీల కేటాయింపులో భారీగా అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు లేకపోలేదు. అసలు రాష్ట్ర ఉపాధిశాఖ కార్యాలయంలో లేని నిబంధనలు జిల్లాలో పెట్టి పెద్దఎత్తున డబ్బులు వసూళ్లు చేశారని సమాచారం. పోని కామారెడ్డి జిల్లాకే సపరేట్‌గా నిబంధనలు పెట్టారని అనుకున్న వాటి అమలును మాత్రం చేయకపోవడం గమనార్హం. గత 6నెలల క్రితం జిల్లాలోని ప్రభుత్వ శాఖలలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిర్వహణ కోసం 14 ఏజెన్సీలను ఆయా శాఖలకు కేటాయించిన అధికారులు టెండర్‌లో వారు పెట్టిన నిబంధనలనే తుంగలో తొక్కి దాదాపు 8 నుంచి 10ఏజెన్సీలకు అర్హత లేకున్న కేటాయించారు. ఏజెన్సీల కేటాయింపు సమయంలో టెండర్‌వేసేందుకు ప్రక్రియను చేపట్టిన ఉపాధికార్యాలయ అధికారులు అందులో పలు అంశాలను పేర్కొన్నారు. ఇందులో మొదటిది ఏదైతే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంబంధించి నిర్వహణ బాధ్యతలు తీసుకునే ఏజెన్సీలు ఉంటాయో ఆ ఏజెన్సీలు ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయిన ఖచ్చితంగా మూడు నెలల పాటు ఈపీఎఫ్, ఈఎస్ఐ ప్రతీ ఉద్యోగికి చెల్లించాలి. కానీ ఇందులో చాలా ఏజెన్సీలు అసలు ఉద్యోగుల ఈపీఎఫ్, ఈఎస్ఐ చెల్లించడం లేదు. ఇక రెండోది టెండర్ వేసిన సమయంలో రెండు సంవత్సరాలు అంటే (2022నుంచి 2024) 100 మంది ఉద్యోగులను సరాఫరా చేయాలనే నిబంధనలు పెట్టారు.దాని అమలు ఎక్కడ చేయలేదు. కలెక్టరేట్‌లోని పలు విభాగాలకు, మెడికల్ కళాశాల, బీసీ అభివృద్ధి యూత్‌అండ్ స్పోర్ట్స్‌శాఖలలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది నిర్వహణకై అర్హతలేని ఏజెన్సీలకు కేటాయించినట్లు తెలిసింది.ఇక మూడో నిబంధన టెండర్ దారుడు ఎవరైతే ఉంటారో కనీసం 2021 నుంచి మూడేళ్ల కోటిపైన టర్నోవర్ చేసి ఉండాలి. కానీ ఈనిబంధన చాలావరకు ఉన్న ఏజెన్సీల అర్హతలకు అనుగుణంగా లేదు. ఇలా అనేక రకాలుగా ఏజెన్సీల కేటాయింపులు తమకు నచ్చిన వారికి తోచిన విధంగా కేటాయించారని సమాచారం.

కార్యాలయ సిబ్బంది సన్నిహితులకు పోస్టింగ్‌లు

నిబంధనలకు విరుద్ధంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను భర్తీ చేసిన, ఆయా శాఖలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఈపీఎఫ్,ఈఎస్ఐ కట్టకపోయిన,టెండర్‌లో వేసిన నిబంధనలకు సంబంధించిన అర్హతలు లేకున్న ఉపాధికల్పన శాఖ అధికారులు ఇష్టరితిన ఏజెన్సీలను కేటాయించారు. ఇందుకుగాను స్వామికార్యానికి కార్యాలయ సిబ్బంది సన్నిహితులకు, బంధువులకు పోస్టింగ్‌లు ఇచ్చేలా చేసుకున్నారు. వారు సైతం కామారెడ్డి జిల్లాకు చెందిన వారు కాకపోవడం గమ నార్హం. వాస్తవానికి జిల్లాకు సంబంధించిన వారికే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలను కేటాయించాల్సి ఉంటుంది. కానీ ఇతర జిల్లాకు చెందిన వారిని ఉద్యోగాలువచ్చేలా చక్రం తిప్పారని తెలుస్తోంది. కామారెడ్డి మెడికల్ కళాశాలలో గతంలో భర్తీచేసిన 32 పోస్టులలో దాదాపు 5గురు నిజామాబాద్ జిల్లాకు చెందిన వారున్నారు. వాళ్లలో కొందరు ఉపాధి కల్పన కార్యాలయ (తరువాయి 8వ పేజీలో...)

41రోజుల దీక్షతో మానసిక ప్రశాంతత



- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్

7

ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కనే వ్యర్థాలు

- దుర్వాసనతో ముక్కు మూసుకుంటున్న జనం
- వ్యర్థాలను రోడ్డు పక్కనే పారబోస్తున్న చికెన్ సెంటర్ నిర్వాహకులు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

7



బీర్కూర్‌లో 10 నుంచి క్రికెట్ టోర్నమెంట్

బీర్కూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలో ఈనెల 10వ తేది నుంచి ఫ్రెండ్స్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విన్నర్‌కు రూ.12,116, రన్నర్‌కు రూ.8,116ల నగదు బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. ప్రతి మ్యాచ్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల టీమ్‌లు టోర్నమెంట్‌లో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా..
ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్

కామారెడ్డిటౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కామారెడ్డి కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజావాణికి 96 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. భూసమస్యలు, రైతు భరోసా,పెన్షన్‌లు, ఇతర సమస్యలపై అర్జీలను సమర్పించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేను వేగవంతం చేయాలని, ఇప్పటికే సర్వేచేసిన వివరాల్లో రూఫ్‌వివరాలు, గోడల వివరాలు పరిశీలించాలని అన్నారు. ఇంతకుముందు ఎస్‌సీ, ఎస్‌టీ, మైనార్టీలు, దివ్యాంగుల లబ్ధిదారులకు పంపిణీచేసిన రెండు పడకగదుల ఇళ్లవివరాలు రేపటిలోగా సమర్పించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. కామారెడ్డి మున్సిపాలిటీలో సర్వే త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్యలు రాకుండా అద్దెబోర్లు పరిశీలించాలని తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం కొనసాగించాలన్నారు. ఆస్తిపన్ను వందశాతం వసూలుచేయాలని అన్నారు. నర్సరీలలో మొక్కలను వందశాతం సంరక్షించాలని తెలిపారు. నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. జిల్లా బేడబుడగ జంగం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మాచారెడ్డి మండలం చుక్కాపూర్ గ్రామం కులసర్టిఫికెట్ల విషయంలో, వారి సమస్యలపై కలెక్టర్‌కు విన్నవించారు. సమగ్రశిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, మధ్యాహ్న భోజన బిల్లులు చెల్లించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసనతెలిపి ఏవోకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌డీఓ రంగనాథ్ రావు, జడ్పీసీఈవో చందర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ సర్వేను రెండు రోజుల్లో పూర్తిచేయాలి

రాజంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల సర్వే రెండురోజులలో పూర్తి చేయాలని తహసీల్దార్ అనిల్ సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ అనిల్ మాట్లాడుతూ ఇందిరమ్మఇళ్ల సర్వేను రెండురోజుల్లోగా పూర్తిచేయాలన్నారు. రాబోయే ఎండకాలం దృష్ట్యా తాగునీటికి సమస్యరాకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవాలని, ఇంటి ట్యాక్స్ వేగవంతంగా చేయాలని తెలిపారు. ధరణిపెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పూర్తిచేయాలనిన్నారు. ఎల్లారెడ్డికి సంబంధించి 16 పోలింగ్ కేంద్రాలలో 12766 మంది ఓటర్లు, కామారెడ్డికి సంబంధించి 9 పోలింగ్ కేంద్రాలలో 9528మందిఓటర్లు ఉన్నారని తెలిపారు.

నేడు బాన్సువాడకు మంత్రి జూపల్లి రాక

- పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు
- భారీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి

బాన్సువాడ, జనవరి6(ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు జిల్లా ఇన్‌చార్జి ఎక్సైజ్ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం రానున్నట్లు ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజులు తెలిపారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ బాన్సువాడ పట్టణంలో అమృత్ కేంద్ర ప్రభుత్వ మంచినీటి పథకానికి రూ.52 కోట్లు మంజూరు కాగా శంకుస్థాపన కార్యక్రమం మంత్రి చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా బాన్సువాడ ఎక్సైజ్ నూతన భవన ప్రారంభోత్సవం ఉన్నట్లు వారు తెలిపారు. అనంతరం బాన్సువాడ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మంచినీటి పథకం పైలాన్ ఆవిష్కరణతో పాటు బహిరంగ సభలో మంత్రి పాల్గొననున్నట్లు చెప్పారు. బహిరంగ సభకు బాన్సువాడ నియోజకవర్గంలోని నాయకులు కార్యకర్తలు పెద్దసంఖ్యలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఉదయం తొమ్మిది గంటల నుండి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాల్లో మంత్రి పాల్గొంటారని వారు తెలిపారు. మంత్రి జూపల్లి రాక సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లను సోమవారం సాయంత్రం ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజ్, డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డిలు పర్యవేక్షించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు వారు వెల్లడించారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోచారం, కాసుల

నిజాం సాగర్ నీటిని పొదుపుగా వాడాలి

- రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

7

లింగంపేట బీసీ బాలుర వసతి గృహంలో
సమస్యల తిష్ట!

- శిథిలావస్థలో లింగంపేట బీసీ బాలుర వసతి గృహ భవనం
- సంక్షేమ వసతి గృహాల్లో అమలు కాని కామన్ డైట్
- రుచికర భోజనం లేక చెత్తబుట్టలో ఆహారం
- బాత్‌రూంలోనే భోజనాల ప్లేట్లు కడుగుతున్న విద్యార్థులు
- పగిలిన అద్దాల నుంచి గదుల్లోకి వస్తున్న కోతులు.. చలికి వణికిపోతున్న విద్యార్థులు





పెచ్చులూడుతున్న వసతిగృహం గదుల్లోని పైకప్పు



ట్యాపుల్లేక బాత్‌రూంలలోనే ప్లేట్స్ కడగడంతో బాత్‌రూంలో ఉన్న అంట్లు



రుచి లేదని విద్యార్థులు పారవేసిన ఉప్మా

లింగంపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలనే సంకల్పంతో డైట్ చార్జీలు పెంచడంతోపాటు గురుకులాల్లోని విద్యార్థులకు, సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కామన్ డైట్ విధానం ఉండాలని కొత్తగా ప్రవేశపెట్టిన కామన్‌డైట్ విధానం సంక్షేమ వసతిగృహాల్లో అమలు కావడంలేదు. సోమవారం బీసీ సంక్షేమ బాలుర వసతి గృహంలో సోమవారం అల్పాహారం కామన్ డైట్ మెనూలో కిచిడీ విత్ టమాటో చట్నీ ఉండగా పాత మెనూ ప్రకారం ఉప్మా ఉంది విద్యార్థులకు పాత మెనూ ప్రకారం పెడుతున్నారు. ప్రభుత్వం కామన్ డైట్ అమలు చేస్తున్నట్లు వసతి గృహంలో బోర్డు మాత్రం పెట్టారు. ప్రచారం జరుగుతున్నా పేద విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై వసతి గృహం వార్డెన్ రాజేశ్వర్‌ను వివరణ కోరగా.. కలెక్టర్ ఆదేశాలతోనే పాత మెనూ పాటిస్తున్నామని, జిల్లాలో ఎక్కడా సంక్షేమ వసతి గృహాల్లో కామన్ డైట్ అమలు కావడంలేదని చెప్పారు. వసతి గృహం సైతం శిథిలావస్థకు వచ్చింది. గదులు పెచ్చులూడి ప్రమాదకరంగా మారింది. కిటికీల తలుపులకు టవర్ బోల్ట్‌లు పనిచేయకపోవడంతో రాత్రి వేళల్లో తలుపులు తెరుచుకుని చలిలో వణుకుతున్నామని విద్యార్థులు అంటున్నారు. కొన్ని గదులలో వెంటిలేటర్లు పగిలిపోవడంతో అందులో నుంచి కోతులు గదుల్లోకి వచ్చి విద్యార్థులను భయపెట్టడంతో పాటు విద్యార్థుల వస్తువులను ఎత్తుకుపోతున్నాయని వారు తెలిపారు. విద్యార్థులు భోజనాల తర్వాత ప్లేట్లు కడుగడానికి ప్రత్యేకమైన ట్యాప్స్ లేకపోవడంతో స్నానాలు చేసే బాత్‌రూంలలోనే ప్లేట్స్ కడుగుతున్నారు. దీంతో బాత్‌రూంలు పూర్తిగా ఆహార వ్యర్థాలతో నిండిపోయి దోమలు ఈగలు చేరుతున్నాయి. విద్యార్థులు అందులోనే స్నానాలు చేస్తున్నారు. దీంతో విద్యార్థులు రోగాల భారిన పడుతున్నారు. వసతి గృహంలో ప్యూరీఫైడ్ యంత్రాలు ఉన్నా అవి పనిచేయకపోవడంతో విద్యార్థులు బోరునీటినే తాగుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వసతి గృహంలోని విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

చలితో చాలా ఇబ్బందులు పడుతున్నాం..

- భరత్ తేజా, 9వ తరగతి



గదుల్లోని అద్దాలు పగిలిపోవడంతోపాటు కిటీలకు గొళ్లాలు లేవు. కిటికీల నుంచి వచ్చే చలిని తట్టుకోలేకపోతున్నాం. మాకు పాత మెనూ ప్రకారంమే అల్పాహారం, భోజనం పెడుతున్నారు. ప్లేట్లు కడిగేందుకు ప్రత్యేకమైన ట్యాప్‌లు లేవు.

ఫటా..ఫట్...

భూ సమస్యల ఫిర్యాదులపై తక్షణ పరిష్కారం

● పోతంగల్ తహసీల్దార్ మల్లయ్య



పోతంగల్ మండల పరిధిలో రెవెన్యూ పరంగా వచ్చిన ప్రతీ ఫిర్యాదును పరిశీలించిన తక్షణమే పరిష్కారిస్తున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

తహసీల్దార్: పోతంగల్ మండలంలో మంజీర పరివాహక ప్రాంతాలలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసు సిబ్బందితో కలిసి ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేశాము. రాత్రివేళ ముమ్మరంగా తనిఖీలు నిర్వహిస్తూ ఇసుక అక్రమ కట్టడికి చర్యలు తీసుకుంటున్నాము.

ఆంధ్రజ్యోతి: మండలంలో ధరణి ఎన్ని పరిష్కరించారు?

తహసీల్దార్: మండలంలో భూసమస్యల పరంగా వంద ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటికే సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి 90కి పైగా సమస్యలను పరిష్కరించాము.

ఆంధ్రజ్యోతి: కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు ఎన్ని పంపిణీ చేశారు?

తహసీల్దార్: గత సంవత్సరంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు కొంత మేర పంపిణీ చేశాము. మరికొన్ని ఎమ్మెల్యే స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయి.

● (ఆంధ్రజ్యోతి,పోతంగల్)

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

భీమ్‌గల్, జనవరి6(ఆంధ్రజ్యోతి): ప్రమాదాల నివారణకు ప్రతీ ఒక్కరు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ఎస్సై మహేష్ సూచించారు. సోమవారం భీమ్‌గల్‌లోని ప్రధాన కూడళ్లలో రోడ్డు భద్రత వారోత్సవాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై అబ్దుల్‌సత్తార్, సిబ్బంది గంగాదర్, గోపాల్, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని బోధన్ ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది, అధ్యాపక బృందం తదితరులున్నారు.

మోటాఫ్ న్యూమో వైరస్‌పై అవగాహన

సాలూర,జనవరి6(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని ఖాజాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చైనా దేశంలో విజృంభిస్తున్న హ్యూమన్ మోటాఫ్ న్యూమో వైరస్‌పై పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజ్‌కుమార్ అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎంటీ వైరస్ శ్వాసకోశ వైరస్ లాగా ఉంటుందన్నారు. శీతాకాలంలో జలుబు మరియు ఫ్లూ వంటి లక్షణాలను కలిగిస్తుందని, పిల్లల్లో, వృద్ధుల్లో ఈ ప్రమాదం ఎక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. జాగ్రత్తగా ఉండాలన్నారు. దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు కండువాలను అడ్డుగాపెట్టుకోవాలన్నారు. చేతులను సబ్బుతో కడుక్కోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభ, ఉపాధ్యాయులు లక్ష్మణ్, సాయిలు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సుంకినిలో ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి,జనవరి6(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలంలోని సుంకిని గ్రామంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. సోమవారం ఉదయం మంజీర నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టీమ్ ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్లపై చర్యల నిమిత్తం రవాణా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు ట్రాక్టర్ యాజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మాక్లూర్, జనవరి6(ఆంధ్రజ్యోతి): మాక్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాంధీ నగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సంపంగి సాయిలు(42) అనే వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడు సాయిలు దాస్‌నగర్‌కు చెందిన వాడు కాగా ఆదివారం మోటర్‌సైకిల్‌పై నందిపేటకు కూలీ పనికి వెళ్లి తిరిగి వస్తుండగా గాంధీనగర్ రాత్రి సమయంలో ఎదురుగా వస్తున్న మోటర్‌సైకిల్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలు కాగా అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలి ంచగా అపస్మారక స్థితిలో ఉన్న సాయిలు మృతి చెందాడు. మృతుడు భార్య లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కిసాన్ సమ్మాన్ నిధి పెంపుతో రైతుల్లో హర్షం

మద్నూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పీఎం కిసాన్ సంబంధించిన మొత్తాన్ని రూ.6 వేల నుంచి రూ.పది వేలకు పెంచుతున్నట్లు పీఎం నరేంద్రమోది చేసిన ప్రకటనతో రైతుల్లో ఆనందం వెల్లి విరుస్తుంది.

● కొత్తగా పట్టా చేసుకున్న రైతులకు ఏది సమ్మాన్...

నాలుగేళ్ళుగా ఇప్పటి వరకు 18 విడతలుగా ఏటా రూ.ఆరు వేలను మూడు దఫాలుగా జమ చేసింది. 2019 నుంచి కేంద్రం నిబంధనలను సడలించకపోవడంతో కొత్తగా పట్టాలు పొందిన రైతులకు సాయం అందడం, 2019 ఫిబ్రవరి వరకు పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఆదాయపు పన్ను చెల్లింపు దారులను మినహాయించి మిగిలిన పట్టాదారు రైతులకు కిసాన్ సమ్మాన్ జాబితాలో చేర్చారు. ఒకే కుటుంబంలో ఇద్దరు వ్యక్తుల పేరిట భూములు ఉంటే ఒక్కరికి వర్తింజే స్తున్నారు. పట్టాదారు మరణిస్తే ఆ భూమిని విరాసత్ చేసుకున్న వారికి తిరిగి పథకాన్ని వర్తింపజేస్తున్నారు. తమ అవసరాల రీత్యా లబ్దిదారులు భూములను విక్రయిస్తే ఆ భూములు కొనుగోలు చేసిన వారికి వర్తింపజేయకపోవడంతో ఏటా లబ్దిదారుల సంఖ్య తగ్గుతుంది. అదే విధంగా సమ్మాన్ నిధిపై అమలుపై కేంద్ర ప్రభుత్వం విధించిన అంక్షలు సంగతి ఏమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు.

బోధన్ పట్టణ శివారులో ఆటో బోల్తా

● డ్రైవరు మృతి.. విద్యార్థులకు స్వల్ప గాయాలతో సురక్షితం

బోధన్‌రూరల్,జనవరి6(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ శివారులో సోమవారం రాత్రి ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడడంతో షేక్ గౌస్(38) అనే ఆటో డ్రైవర్ మృతి చెందగా ఆటోలో ఉన్న నలుగురు విద్యార్థులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయటపడిన సంఘటన చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించింది బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం బోధన్ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదివే విద్యార్థులు ట్యూషన్ ముగించుకుని తమ స్వగ్రామామైన పెగడాపల్లికి ఆటోలో ఇంటికి వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడిందన్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ గౌస్ అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో ఉన్న నాలుగురు విద్యార్థులు స్వల్ప గాయాలతో సురక్షితంగా బయట పడ్డారు. ప్రమాద ఘటన తెలుసుకున్న పట్టణ సీఐ హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు.ఘటనస్థలంలో మృతి చెందిన షేక్ గౌస్ మృతదేహన్ని బోధన్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

సంవత్సర కాలంలో 55వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



నవీపేటలో విద్యార్థులతో మాట్లాడుతున్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట,జనవరి6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఒక సంవత్సర కాలంలోనే 55వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో 72మందికి కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం జడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు వారానికి మూడు గుడ్లు ఇవ్వాల్సి ఉండగా బిల్లులు రావడం లేదన్న నెపంతో వాటిని అందించకపోవడం సరికాదన్నారు. హస్టల్‌లో చదివే విద్యార్థులకు 40శాతం భోజన మెస్ చార్జీలు పెంచి ఇవ్వడం జరిగిందని, ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్ర కుమార్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మోస్రా సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా చెల్లించాలని కోరుతూ బీఆర్ఎస్ నిరసన



వేల్పూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవీపేట,జనవరి6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఎకరాకు 15వేల రూపాయల చొప్పున రైతు భరోసా అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు ఎకరాకు రూ.12వేల చొప్పున మాత్రమే చెల్లిస్తామని పేర్కొనడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు ఎకరాకు రూ.15వేల చొప్పున రైతు భరోసా చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకట రమణకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింగరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేల్పూర్: సీఎం రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతు భరోసా కింద రూ.15వేలు, రూ.2లక్షల రుణమాఫీ చేయాలంటూ సోమవారం వేల్పూర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ ఎస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రైతాంగాన్ని కాంగ్రెస్ అన్ని విధాల నమ్మక ద్రోహం చేసిందని, రైతులకు ఇచ్చిన ప్రధాన హామీలు నెరవేర్చకుండా తీరని ద్రోహం రేవంత్‌రెడ్డి చేశారని ఆరోపించారు. అనంతరం తహ సీల్దార్ సంతోష్‌కు మెమోరాండం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్య కర్తలు, పాల్గొన్నారు.

మెండోర: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు రైతులకు రైతు భరోసా ఇచ్చిన మాట ఎక్కడికి పోయిందని, ఇచ్చిన మాట ప్రకారం నెరవేర్చాలని డీసీసీబీ డైరెక్టర్ నాగంపేట్ శేఖర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు వివేకానంద విగ్రహం ఎదుట బీఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలిపి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతీ రైతుకు భరోసా సాయం కింద ఎకరానికి రూ.15వేలు ఇస్తామని హామీ ఇచ్చి నేడు రూ.12వేలు ఇస్తామనడం సిగ్గుచేటని, నేటి వరకు రాష్ట్రంలో ఏ ఒక్క రైతు బాగుపడిన దాఖలాలు లేవని, నాడు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం డబ్బులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తలారి గంగాధర్, నవీన్‌గౌడ్, మచ్చర్ల రాజారెడ్డి, కమలాకర్, గోపిడి గంగారెడ్డి, ఏలేటి శ్రీనివాస్, కొప్పెల సాయన్న, రాజు, దేవేందర్, బాబా, అక్తర్, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: గత ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఎకరాకు 15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తు సోమవారం కమ్మర్‌పల్లి జాతీయ రహదారిపై మండల బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేపట్టారు. ధర్నా కార్యక్రమంలో నాయకులు బద్దం చిన్నారెడ్డి, కలేరి శేఖర్, బద్దం రాజేశ్వర్, గడ్డం స్వామి, పిప్పెర అనీల్, సామ బాపురెడ్డి, నరేందర్, మహేందర్, ఉన్నారు.

సంక్రాంతి పండుగకు ప్రత్యేక బస్సులు

బోధన్‌రూరల్,జనవరి6(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసిందని బోధన్ ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం బోధన్ ఆర్టీసీ డిపోలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు సొంత ఊళ్లకు వెళ్లే వారి కోసం టీజీఎస్ ఆర్టీసీ నిజామాబాద్ రీజినల్ ప్రత్యేక ఏర్పాట్లు చేసిందన్నారు. ప్రయాణికులు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరేందుకు జిల్లాలో 444ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించిందన్నారు. దూర ప్రాంతాలకు, ఆంధ్ర ప్రాంతానికి వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం బోధన్ డిపో నుండి హైదరాబాద్, విజయవాడ వరకు స్పెషల్ బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 9వ తేది నుండి 12వ తేది వరకు, 16వ తేది నుండి 20వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయన్నారు. సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సీటీ ఆర్డీనరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు, తమ ప్రయాణ సమయంలో మహిళలు ఆధార్ కార్డు చూపించి జీరో టిక్కెట్లు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక బస్సులను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సంక్రాంతి పండుగను సురక్షితమైన బస్సుల్లో ప్రయాణించి తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

సంక్రాంతి పండగకు 444 ప్రత్యేక బస్సులు

పెర్కిట్: సంక్రాంతి పండగ రద్దీని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నిజామాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు వివిధ గ్రామాలు, ఆంధ్ర ప్రాంతానికి వెళ్లడానికి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయను న్నట్టు నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జోష్న తెలిపారు. ఈనెల 9నుంచి 12వ తేదీ వరకు, 16నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు నడపుతున్నామని ఆమె తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



బాల్కొండలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన కాంగ్రెస్ నాయకులు

రెంజల్: ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా రైతు భరోసాను 12వేలకు పెంచుతూ ఉపాధి హామీ కూలీలకు సంవత్సరానికి 12వేలు ఇవ్వలని కెబినెట్‌లో తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ ఆధ్వర్యంలో సాటాపూర్ చౌరస్తాలో సోమవారం సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వీట్లు పంచి పెట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పనిసరిగా నెలవేరుస్తుందన్నారు. ఇచ్చిన మాట నిలబెట్టుకునే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ప్రజల సంక్షేమమే పరమావధిక పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సదా రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాయిరెడ్డి, సాయిబాబా గౌడ్, జావీదోద్దీన్, గాయస్, ఎంఎల్ రాజు, బోధన్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కార్తీక్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గైని కిరణ్, నాయకులు ఒడ్డెక్కొళ్ల మోహన్, రవి, రవీందర్ గౌడ్, రమేష్, వినోద్, యోగి, ఖుద్దుస్, షంషోద్దీన్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: చరిత్రలో ఎవరు ఆలోచించని విధంగా భూమిలేని నిరుపేదలకు రూ.12వేల ఆర్థిక సహాయం ఎంతో హర్షనీయమని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం మం డల కేంద్రంలో తెలంగాణ ప్రజాప్రభుత్వం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12వేలు ఆర్థిక సహాయం ప్రకటిం చడంతో బాల్కొండ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణి గ్రామంలో మిషన్ భగీరథ నీటి కష్టాలు

● ఆందోళనలో గ్రామస్తులు ● పట్టించుకోని అధికారులు



భగీరథ వాటర్ ట్యాంక్

ఎల్లారెడ్డి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి గ్రామంలో మిషన్ భగీరథ నీరు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. గ్రామానికి రెండు వాటర్ ట్యాంకులు ఉన్నప్పటికీ గ్రామపంచాయతీ ఆవరణలో ఉన్న భగీరథ వాటర్ ట్యాంక్‌కు మెట్లకు రిలే లేక పోవడంతో పాటు శిథిలావస్థకు చేరడంతో వాటర్ ట్యాంకు నిండిన తర్వాత ఓవర్ ఫ్లో నీటితో పక్కనే ఉన్ననివాసాల పైన నీరు పడుతుంద ని, ఆనీటితో నివాసాలు దెబ్బతింటున్నాయని బాధితులు ఫిర్యాదు చేయడంతో అధి కారులు నీటి సరఫరా నిలిపివేశారు. దీంతో గ్రా మానికి సరిపడా నీరు అందడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికా రులు స్పందించి ట్యాంకుకు మరమ్మత్తులు నిర్వహించి మిషన్ భగీరథ నీటిని సప్లై చేసి గ్రామానికి సరిపడా నీటిని విడుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

దోమకొండ, (బీబీపేట) జనవరి 6(ఆంధ్రజ్యోతి):దోమకొండ మండల కేంద్రంలోని పలుగడ్డ పాఠశాల, బీబీపేట మండలంలోని యాడారం గ్రామంలో సోమవారం వర్డ్ సంస్థ ఆధ్వర్యంలో క్వీజ్ పోటీలు నిర్వహించారు. కౌమార దశశిక్షణ కార్యక్రమంలో భాగంగా 8,9,10 తరగతులకు చెందిన బాల, బాలికలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీవిద్య, వంశీక్రిష్ణ, ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర ప్రసాద్, వెంకట్‌రెడ్డి,విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయిని కాల్చివేసిన ఎక్సైజ్ అధికారులు

జక్రాన్‌పల్లి, జనవరి6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పడకల్ గ్రామంలో గల ఫ్రీ మెడికల్ ఫ్యాక్టరీలో పట్టుకున్న 527.67కిలోల ఎండు గంజాయితో పాటు 3.6కిలోల అల్ఫోజలం కాల్చివేసినట్టు ఎక్సైజ్ అధికారులు కె.మల్లారెడ్డి తెలిపారు. సోమవారం ఎక్సైజ్ అధికారులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భీమ్‌గల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 3.67కిలోల గంజాయిని పట్టుకుని నాలుగు కేసులు నమోదు చేశామని తెలిపారు. బోదన్ ఎక్సైజ్ పరిధిలో 300కిలోల గంజాయి, నిజామాబాద్ ఎక్సైజ్ పరిధిలో 220కిలోల గంజాయి, 3.6కిలోల అల్ఫోజలం, మోర్తాడ్ ఎక్సైజ్ పరిధిలో .2.1 కిలోల గంజాయిని, ఆర్మూర్ ఎక్సైజ్ పరిధిలో రెండు కిలోల గంజాయిని పట్టుకొని కాల్చివేసినట్టు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్, డైరీ ఆవిష్కరణ



క్యాలెండర్, డైరీని ఆవిష్కరిస్తున్న డీఈ వి.రాజేశ్వర్‌రావు

ఆర్మూర్‌టౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిరాయత్‌నగర్ విద్యుత్ కార్యాలయంలో సోమవారం టీఈఈ 1104 యూనియన్ నూతన సంవత్సర క్యాలెండర్, డైరీలను డీఈ వి.రాజేశ్వర్‌రావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ డివిజన్ అధ్యక్షుడు ఎం.సంజీవ్, ప్రధానకార్యదర్శి నరేంధర్‌నాయక్, ప్రదీప్, గంగారాం, సురేష్‌బాబు, షకీల్, నాగభూషణం, ఉత్తమ్, హరిశంకర్, లక్ష్మణ్‌గౌడ్, సంతోష్, మహిపాల్, భూమేష్, సిద్దయ్య, శంకర్, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్: వేల్పూర్ మండలం టీపీయుసీ ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర టీపీయుసీ క్యాలెండర్, డైరీలను ఎంఈవో రేణుక ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల టీపీయుసీ అధ్యక్షుడు రవి చందర్, కార్యదర్శి అజయ్, జిల్లా ఉపాధ్యక్షుడు శివాజీ, హెచ్‌ఎంలు రాజన్న, వైద్యగణేష్, శ్యామ్‌చరణ్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

నవీపేట: మండలంలోని జడ్పీహెచ్‌ఎస్ నాళేశ్వర్ పాఠశాలలో సోమవారం క్యాలెండర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో బినోల సొసైటీ చైర్మన్ హన్మాండ్లు, మాజీ సర్పంచ్ సరిన్, ప్రవీణ్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీదీప్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

● బీఎల్‌టీయూ ఆధ్వర్యంలో

తెలంగాణ బహుళ జన బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.సిద్దిరాములు తదితరులున్నారు.

హైదరాబాద్‌కు తరలిన టీఎన్‌జీవోస్

కామారెడ్డిటౌన్,జనవరి 6(ఆంధ్రజ్యోతి):కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద నుంచి సోమవారం టీఎన్‌జీవోస్ హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యోగులందరు సంవత్సరానికి ఒకసారి జరుపుకునే డైరీ ఆవిష్కరణ పండుగకై హైదరాబాద్‌లోని నాంపల్లిలో గల లలిత కళాతోరణంను తరలుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా ప్రధానకార్యదర్శి నాగరాజు,చక్రధర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ సమావేశంలో పలు తీర్మానాలు

వేల్పూర్, జనవరి6(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల పీఆర్‌టీయు కార్యవర్గ సమావేశం మండల పీఆర్‌టీయు అధ్యక్షుడు బోడ దేవనందం అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సమా వేశంలో మండల ప్రధానకార్యదర్శి సీవీ.నర్సింహరావు, పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు టి.హరిచరణ్, సీహెచ్.కాంతయ్య, పతాని గంగాధర్, దేవరాజ్, మండల అసోసియేట్ అధ్యక్షుడు రాజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

రెంజల్,జనవరి6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో అడ్మిషన్‌లు పొందుటకు ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఫిరోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అడ్మిషన్‌ల కొరకు ఈనెల 6 నుంచి ఫిబ్రవరి 28వ తేది వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఎస్సీఎస్టీ, బీసీ టీడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125, ఇతర విద్యార్థులకు రూ.200 ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కోరారు.పరీక్షలకు సంబంధించిన హల్‌టిక్కెట్లను ఆన్‌లైన్‌లోనే ఏప్రిల్ 3వ తేది నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఏప్రిల్ 13వ తేదీన అడ్మిషన్ పరీక్షలు నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఉపాధ్యాయుల కోసం విద్యార్థుల ధర్నా

● సముదాయించిన విద్యాశాఖ అధికారి



విద్యార్థులతో మాట్లాడుతున్న మండల విద్యాశాఖ అధికారి

బోధన్‌రూరల్,జనవరి 6(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో విద్యార్థినులు సోమవారం ధర్నా చేపట్టారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెలో భాగంగా కేజీబీవీ టీచర్లు సమ్మెలో ఉన్నారు. దీంతో సోమవారం ప్రభుత్వం విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తాత్కాలికంగా ఇతర పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసింది. ఈ క్రమంలో పాఠశాల విద్యార్థినులు తమకు పాఠాలు చెప్పే పాత టీచర్లు రారు అనుకుని తమ టీచర్లే కావాలని డిమాండ్ చేస్తూ పాఠశాల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి నాగయ్య పాఠశాలకు చేరుకుని విద్యార్థినులను సముదాయించి ధర్నా విరమింపజేశారు. దీంతో తరగతి గదులకు విద్యార్థినులు వెళ్లిపోయారు.

నందిపేటలో క్యాన్సర్ నిర్ధారణ శిబిరం



పలుగుట్ట ఆశ్రమంలో మహిళలకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నందిపేట, జనవరి 6(ఆంధ్రజ్యోతి):నందిపేట మండల కేంద్రంలోని పలుగుట్టపై రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, కృష్ణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (క్రిమ్స్), శ్రీ కేదారేశ్వర ఆశ్రమం ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మహిళలకు ఉచిత రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ శిబిరం నిర్వహించారు. డాక్టర్ క్రిపా బజాజ్ అద్వర్యంలో శ్రీ కేదారేశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు శ్రీ మంగి రాములు మహరాజ్ శిబిరాన్ని ప్రారంభించారు. పలువురు మహిళలకు డాక్టర్‌లు మహిళలకు ఉచితంగా రొమ్ము క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ నిర్వాహకులు మంగి రాములు మహరాజ్‌ను సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ కార్యదర్శి గంగారెడ్డి, కార్యనిర్వహణ అధికారి డాక్టర్ నవీన్‌మాలు, బీరెల్లి నర్సింగ్ రావు, కిమ్స్ పీఆర్‌వో కరుణాకర్,ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు,సిబ్బంది తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం స్థల పరిశీలన

ఆర్మూర్‌టౌన్, జనవరి6(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో 24వార్డులో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం స్థలాన్ని పరిశీలించినట్టు ఏఈ మౌనిక తెలిపారు. కాలనీలో లోవోల్టేజీ సమస్య ఉండడంతో పలువురి ఫిర్యాదు మేరకు స్థలాన్ని పరిశీలించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు. ఆమె వెంట స్థానిక కౌన్సిలర్ ఆకుల రాము, కాలనీవాసులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోధన్‌రూరల్,జనవరి6(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో మంగళవారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ నాయిని కృష్ణ తెలిపారు. ఫీడర్ మెంటనెన్స్‌లో భాగంగా 33/11 కేవీ చెక్కి స్టేషన్ పరిధిలోని 11కేవీ, ఆజాంగంజ్ పరిధిలోని కాలనీలు, ఆర్టీసీ కాలనీ, గంజ్ మెయిన్ రోడ్డు, మార్కెట్ రోడ్డు, పోలీస్ స్టేషన్ ఏరియా, షర్బత్ కెనాల్ ఏరియాల్లో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈ సందర్భంగా కోరారు.

సంతలో దొంగతనం

భీమ్‌గల్, జనవరి6(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ పట్టణంలో సోమవారం జరిగే సంతలో రెండు దొంగతనాలు జరిగినట్టు ఎస్సై మహేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం కుప్కాల్ గ్రామానికి చెందిన బాబానగర్ నర్సు సంతలో కూరగాయలు తీసుకుంటుండగా కవర్‌లో పెట్టుకున్న రూ.20 వేలను గుర్తుతెలియని దొంగలు దొంగిలించారని,అలాగే పల్లికొండ గ్రా మానికి చెందిన గంధం సుప్రియ సంతకు వచ్చి విజయదుర్గా సిల్వర్ మ ర్చంట్ పేరు గల బ్యాగ్‌లో అర్దతులం విలువ చేసే బంగారు కమ్మలు గల బ్యాగును పక్కన పెట్టి అంగల్లో కూరగాయలు తీసుకుంటు ఉండగా బ్యాగు ను గుర్తు తెలియని దొంగలు దొంగిలించారని బాధితులు తెలిపారు.బాధి తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆర్మూర్‌లో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

ఆర్మూర్‌రూరల్, జనవరి6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అంగన్‌వాడి టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్మూర్ పట్టణంలో సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు పి.చంద్రకళ ఆవిర్భావ దినోత్సవ జెండాను ఎగురవేశారు. అనంతరం సీఐటీయు మండల కన్వీనర్ కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి గోదావరి, అరుణ, లక్ష్మి, జగదాంబ, భారతి, తదితరులు పాల్గొన్నారు.

చేపూర్‌లో మత్స్యకారులకు చిక్కిన 25కేజీల చేప

ఆర్మూర్‌రూరల్, జనవరి6(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్ మండలం చేపూర్ గ్రామంలోని ఊరచెరువులో సోమవారం మత్స్యకారుల వలలో 25కేజీల చేప చిక్కింది. గత కొన్నేళ్లుగా తమ జీవనాధారమైన చేపల వృత్తి చేస్తున్నప్పటికీ ఇంత పెద్ద చేప తమకు చిక్కడం ఇదే మొదటిసారి అని మత్స్యకారులు పేర్కొన్నారు. వెంటనే చేపను తూకం వేయగా 25కేజీల వచ్చిందని మత్స్యకారులు సంతోషం వ్యక్తం చేశారు.



చేపూర్‌లో మత్స్యకారులకు చిక్కిన 25కేజీల చేప



మద్నూర్ నుంచి ఇరుముడితో బయలుదేరినర అయ్యప్ప స్వాములు

శబరిమల అయ్యప్ప దర్శనానికి స్వాముల పయనం

● ఇరుముడులతో ఆలయాల్లో సందడి

మద్నూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాములు మండల దీక్ష (41 రోజులు) అనంతరం ఇరుముడి కట్టుకొని మణికంఠుడి దర్శనార్థం కేరళ రాష్ట్రంలోని శబరిమలైకి బయలుదేరి వెళ్లారు. పల్లె నుంచి పట్టణం వరకు అయ్యప్ప మాల ధరించి దీక్ష చేపట్టిన భక్తులు వారి కుటుంబ సభ్యులచే ఆలయాల్లో పూజలు, ఇరుముడులతో సందడి వాతావరణం నెలకొంది. కార్తీక మాసం ప్రారంభం నుంచి మకర సంక్రాంతి పూర్తయ్యే వరకు అయ్యప్ప స్వాముల దర్శనం శబరిమలలో నిరంతరం కొనసాగుతుంది. స్వాములు దీక్ష విరమించే వేల ఇరుముడి తప్పనిసరిగా కట్టుకుంటారు. స్వామి సన్నిధానం చేరుకున్న తర్వాతే ఈ ఇరుముడిని విప్పుతారు. దేవుని ఆత్మ పరమాత్మలను అనుసంధానం చేయడమే ఇరుముడిలోని ఆంతర్యమని పండితులు చెబుతున్నారు. భక్తి, శ్రద్ధ అనే రెండు భాగాలు కలిగిన ఇరుముడిలోని తొలి భాగంలో కొబ్బరికాయలోని నీటిని తొలగించి పూర్తిగా నెయ్యితో నింపుతారు. పూజా సామాగ్రి పెడతారు. రెండో భాగంలో స్వాముల ప్రయాణానికి కావాల్సిన బియ్యం, పప్పు, పసుపు, కుంకుమ వంటివి పెడతారు. శబరిమలకు వెళ్లే అయ్యప్ప భక్తుల్లో కన్నె స్వాములు, గురుస్వాములు ఇరుముడితో 18 మెట్ల గుండ వెళ్లి అయ్యప్ప స్వామిని దర్శించుకుంటారు. తద్వారా కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. సోమవారం మద్నూర్ మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన 65 మంది అయ్యప్ప స్వాములు ఇరుముడితో శబరిమలకు బయలుదేరి వెళ్లారు.

41 రోజుల దీక్షతో మానసిక ప్రశాంతత



ఇరుముడి కార్యక్రమంలో పూజలు చేస్తున్న జుక్కల్ ఎమ్మెల్యే

పెద్ద కొడప్‌గల్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): 41 రోజుల పాటు ఆయా దీక్షలు చేపట్టేవారికి భక్తితో కూడిన ప్రశాంతత వస్తుందని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పేర్కొన్నారు. సోమవారం జుక్కల్ మండల కేంద్రంలో అయ్యప్ప స్వాములు 41 రోజుల పాటు మాల ధరించి నియమనిష్టలతో దీక్ష పూర్తి చేయడం అభినందనీయమని తెలిపారు. అంతేగాక దీక్ష పూర్తి చేయడం అనేది అందరికి సాధ్యం కాదని, భగవంతున్ని కృప ఉంటేనే దీక్ష సాధ్యమని తెలిపారు. 41 రోజుల పాటు మాలదారులు నియమనిష్టలతో ఉండటం వలన ఆరోగ్యం కూడ మెరుగవుతుందని, దీక్ష అనంతరం కూడా మాలదారులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం గురుస్వాములు శబరిమల వెళ్లే అయ్య ప్పలకు ఇరుముడి కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత అయ్యప్పలు శబరిమల బయలుదేరారు. అనంతరం అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తోటను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

జుక్కల్ క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ అనారోగ్య కారణాలు పలు ఆసుపత్రులలో చికిత్సలు చేయించుకున్న వారికి సిఎం సహాయనిధి ద్వారా వచ్చిన చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఎమ్మేల్యే బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ఆలోచన చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయే అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సిద్దులగుట్టపై ఘనంగా పల్లకీసేవ



సిద్దులగుట్టపై పల్లకీసేవలో పాల్గొన్న భక్తులు

పెర్కిట్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిద్దులగుట్టపై ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం పల్లకీసేవ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దులగుట్టకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి శివాలయంలోని సిద్దేశ్వరునికి పంచామృతాలతో, బిల్వపత్రాలతో అభిషేకం చేశారు. నందీశ్వర మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్లకీసేవలో భక్తులు, భజన మండలి సభ్యులు పాల్గొని నృత్యాలు చేస్తూ భక్తిగీతాలు ఆలపించారు. వన్నెల్(బి) గ్రామానికి చెందిన ఏనుగు లతిక రాజేష్‌రెడ్డి దంపతులు గుట్టపై విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పీసీ.గంగారెడ్డి, బి.సుమన్, కోడిగెల మల్లయ్య, పొద్దుటూరి చరణ్‌రెడ్డి, బోండ్ల ఆనంద్, ప్రశాంత్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కలగానే డిచ్‌పల్లి మున్సిపాలిటీ



డిచ్‌పల్లి మండల కేంద్రం

● ప్రతీ సారి ఎన్నికల సమయంలో మున్సిపాలిటీ ఏర్పాటుపై ప్రకటనలు
● అధికారంలోకి వచ్చిన తర్వాత పట్టించుకోని రాజకీయ పార్టీలు

డిచ్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా చేస్తానని అన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్లక్ష్యం చేస్తున్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి ప్రధాన కేంద్రంగా ఉన్న డిచ్‌పల్లి మండల కేంద్రం రోజురోజుకు అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ తెలంగాణ యూనివర్సిటీతో పాటు, ఏడో పోలీస్ బెటాలియన్, సీఎంసీ మెడికల్ కళాశాల, ప్రైవేట్ నర్సింగ్ కళాశాలలు, డిచ్‌పల్లి మండల కేంద్రంలో రైల్వే స్టేషన్‌తో పాటు జాతీయ రహదారి 44కూడా మండల కేంద్రం గుండా వెళ్తుంది. ఇన్ని సౌకర్యాలు ఉండటంతో చుట్టూ పక్కల మండలాలతో పాటు పలు రాష్ట్రాలకు చెందిన ప్రజలు తమ వ్యాపారాల రీత్యా డిచ్‌పల్లిలో స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో రోజురోజుకు డిచ్‌పల్లి విస్తీర్ణం పెరుగుతూ పోతోంది. అందుకు సరిపడా ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించాల్సిన పంచాయతీలకు సామర్థ్యం సరిపోకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. విద్యాపరంగా డిచ్‌పల్లి ఒక హబ్‌గా ఏర్పడింది. త్వరలోనే ఇక్కడ మెడికల్ కళాశాల రానుందని ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ ప్రకటించిన విషయం తెలిసిందే. అన్నిరంగాల్లో ముందు కెళ్తున్న డిచ్‌పల్లిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం సైతం జోరుగా సాగుతుంది. లే అవుట్లు, వెంచర్‌ల లో భారీగా డిమాండ్ ఏర్పాడింది. జిల్లా కేంద్రానికి కూత వేటు దూరం ఉండటం అన్ని వసతులు డిచ్‌పల్లి ప్రాంతంలో ఉండటంతో జనాలు సైతం డిచ్‌పల్లిలో ఉండటానికి ఇష్టపడుతున్నారు. డిచ్‌పల్లి మండల కేంద్రంతో పాటు నడిపల్లి, అమృతపూర్, సుద్దపల్లి, ఘన్‌పూర్, ఖిల్లా డిచ్‌పల్లి పోలీస్ క్యాంప్, ముల్లంగి ఇలా అన్ని గ్రామాలు కలిసినట్టుగానే ఇక్కడ ఉంటాయి. డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా చేస్తే మరింత అభివృద్ధి చెంది ఇక్కడి ప్రజలకు మౌలిక సదు పాయాలు పూర్తి స్థాయిలో కల్పించాలని డిచ్‌పల్లి వాసులు కోరుతున్నారు. ఈ విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ చొరవ తీసుకోవాలని ఆయన సైతం గతంలో ఇదే డిచ్‌పల్లి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. కావున చొరవ తీసుకోవాలని, స్థానిక ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి మున్సిపాలిటీ ఏర్పాటు చేయించాలని స్థానికులు పేర్కొంటున్నారు.

బాజిరెడ్డి కృషి చేసినా అడ్డుపడ్డ స్థానిక బీఆర్ఎస్ నాయకులు

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జిల్లాలో భీమ్‌గల్ మున్సిపాలిటీతో పాటు డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా చేయాలని ప్రతిపాదనలు ఉన్నా అది సాధ్యం కాలేదు. డిచ్‌పల్లి మండలంలోని కొందరు బీఆర్ఎస్ స్థానిక నాయకులు మున్సిపాలిటీ చేయొద్దని, మున్సిపాలిటీ చేస్తే గ్రామాల్లో తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతుందని, తమ రియల్ వ్యాపారానికి ఇబ్బందులు వస్తాయని అదేవిధంగా గ్రామీణ ప్రజలు తీవ్ర అవస్థలు పడుతారని అప్పటి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌పై ఒత్తిడి తీసుకురావడంతో ఆయన సైతం స్థబ్దుగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అప్పటి నుంచి డిచ్‌పల్లి మున్సిపాలిటీ ఏర్పాటు కలగానే మారింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి విజయం సాధించారు. రాష్ట్రంలో సైతం కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున డిచ్‌పల్లిని మున్సిపాలిటీగా ఏర్పాటు చేయాలని ఇక్కడి స్థానికులు కోరుతున్నారు.



డిచ్‌పల్లి గుండా వెళ్తున్న 44వ జాతీయ రహదారి

యాసంగి పంటకు

నిజాంసాగర్ నీటిని పొదుపుగా వాడుకునేలా చూడాలి

● వచ్చే జూన్ నాటికి నిజాంసాగర్‌లో ఆరు టీఎంసీల నిటి నిల్వ ఉండేలా చూసుకోవాలి
● తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి సాధించాలి
● రాష్ట్ర వ్యవసాయ ప్రభుత్వ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): యాసంగి పంటకు నిజాంసాగర్ ప్రాజెక్టులోని నీటిని పొదుపుగా వాడుకునేలా ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో ముందుకు వెళ్లాలని వ్యవసాయ ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. సోమవారం బాన్సువాడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారుల సమీక్ష సమావేశంలో ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ నిజాంసాగర్ నీటి విడుదలపై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందని యాసంగి పంటకు నీటిని పొదుపుగా వాడుకుని తక్కువ నేటితో ఎక్కువ దిగుబడి సాధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అంతేకాకుండా వర్షాకాలం జూన్ నాటికి నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆరు టీఎంసీలు నీటి నిల్వ ఉండేలా చూడాలని రైతాంగానికి సాగునీటి విడుదల చేసేందుకు సిద్ధంగా ఉంచాలన్నారు. రెండో విడత నేటి విడుదలకు సిద్ధం అవ్వడం జరిగిందని, పది రోజులకు ఒకసారి నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి డిస్ట్రిబ్యూటర్ వద్ద నీరు వృథా పోకుండా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు ఇద్దరు సిబ్బందిని నియమించి సమన్వయంతో నీటిని పొదుపుగా వాడుకునేలా చర్యలు తీసు కోవాలని ఆయన తెలిపారు. అంతేకాకుండా సిద్దాపూర్, జాకోర ఇతర పెండింగ్ పంపు హౌస్‌లో పనులు త్వరలో పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులకు సూచించారు. ఏదేమైనా వర్షాకాలం నాటికి నిజాంసాగర్ ప్రాజెక్టులో ఆరు టీఎంసీల నీటిని నిల్వ ఉంచాలని నిర్లక్ష్యం వహించకూడదని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్ర మంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, వికాస్ మెహత, ఇరిగేషన్ జిల్లా అధికారి శ్రీనివాస్, నియోజకవర్గంలోని 9 మండలాల తహసీల్దార్లు, ఇరిగేషన్ ఏఈ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



బాన్సువాడలో అధికారులతో మాట్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం

టీయూ లైబ్రరీలో దాహం.. దాహం

● నీటి కొరతతో విద్యార్థులకు తీవ్ర ఇక్కట్లు



టీయూ లైబ్రరీలో కాలిపోయిన బోరు మోటారు



లైబ్రరీలో పనిచేయని ప్లాంట్

డిచ్‌పల్లి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి) టీయూ సెంట్రల్ లైబ్రరీలో గత 20 రోజులుగా తాగు నీరు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్లు విలే కర్లతో విద్యార్థులు తెలిపారు. గ్రంథాలయం పక్కనే తాగునీటిని అందించే బోరులోని మోటారు కాలిపోయిన వర్సిటీ అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నరని టీయూ గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు సంతోష్ నాయక్ ఆరోపించారు. లైబ్రరీలోని మినరల్ వాటర్ ప్లాంట్ నీరు లేక మూలన పడిందని తాగునీటిపై లైబ్రేరియన్‌ను అడిగితే తమకు డొంక తిరుగుడు సమాధానాలు ఇస్తున్నరని ఆయన ఆరోపించారు. పోటీ పరీక్షలకు సిద్దమవుతున్న విద్యార్థులకు తాగునీటి సమస్య జఠిలంగా మారిందని వెంటనే అధికారులు బోరు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా లైబ్రెరిలో వైఫై రావడం లేదని, ఈ సేవల కోసం పనులు చేశామని చెబుతున్న ఇంత వరకు వైఫై రావడం లేదని తక్షణమే వైఫై పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మౌలిక సదుపాయల విషయంలో వీసీ యాదగిరి రావును విద్యార్థి సంఘాలు అడిగితే కసురుకుంటున్నా రని బంజార విద్యార్థి సంఘం నాయకులు శ్రీను నాయక్ తెలిపారు. విద్యార్థి సంఘాల నాయకుల ఫోన్‌లను వీసీ ఎత్తడం లేదని వీసీ నిర్లక్ష్యంగా పనిచేయడం సరికాదని ఇలా నిమ్మకు నీరెత్తినట్లు పనిచేస్తే విద్యార్థులంతా వర్సిటీలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.


మున్సిపల్ కమిషనర్ పరిశీలన

ఆర్మూర్‌టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని ఇందిరమ్మ ఇళ్ల రీ వెరిఫికేషన్, అంగన్‌వాడి సెంటర్‌లను, కోటార్మూర్ చెరువును మున్సిపల్ కమిషనర్ రాజు సోమవారం పరిశీలించారు. మున్సిపల్ పరిధిలో 6, 7, 23వార్డులలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల రీ వెరిఫికేషన్‌తో పాటు అంగన్‌వాడి సెంటర్‌లను సందర్శించి హాజరుపట్టికను పరిశీలించారు. అలాగే కొటార్మూర్‌లోని చెరువును ఆయన పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, ఇరిగేషన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మినుము పంటకు తెగులు



మినుము పంటకు బూడిద తెగులు సోకిన దృశ్యం



మారుక మచ్చలు ఆశించిన పంట

మద్నూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మినుము పంటకు తెగుళ్ల ఆశించడంతో రైతులు దిగులు చెందుతున్నారు. ప్రస్తుతం మినుము పంట పూత, కాయ ఏర్పడే దశలో ఉందని, మినుము పంటలో మారుకా మచ్చల పురుగు, బూడిద తెగుళ్ల గమనించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై వ్యవసాయ విస్తీర్ణ అధికారి అనిల్ రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ మారుక మచ్చల పురుగును గమనించినట్లయితే ఇది పూత దశ నుంచి తర్వాత కాయలు ఎదిగే దశ వరకు ఆశించి ఎక్కువ నష్టం కలిగిస్తుందనీ కాయల లోపల ఉండి నష్టం కలిగిస్తుందని సూచించారు. ఈ పురుగు ఉధృతి నివారణకు ఎకరాకు ఫ్లూ బెండమైడ్ 40 మీ.లీ లేదా రైనాక్సీ ఫెయిర్ 60 మీ.లీ లేదా స్పైనో శాడ్ 70 మి.లీ అనే మందులను ఒకటి తర్వాత ఒకటి మార్చి పిచికారి చేయాలని అదేవిధంగా మినుము పంటలో బూడిద తెగుళ్లను గమనించడం జరిగిందని, ఈ బూడిద తెగుళ్ల ముఖ్యంగా రాత్రి వేళలో చలిగాను పగటిపూట వేడిగాను ఉన్నప్పుడు బూడిద తెగుళ్ల ఉధృతి పెరుగుతుందని ఈ తెగుళ్ల లక్షణాలు గమనించినట్లయితే తెల్లని బూడిద లాంటి పొర కాయల మీద ఆకుల మీద పిందెల మీద ఏర్పడడం వల్ల మొక్కలలో కిరణ జన్య సంయోగ క్రియ తగ్గిపోయి తగినంత ఆహార పదార్థాలు తయారు కాక దిగుబడులు తగ్గడమే కాక గింజ నాణ్యత కూడా తగ్గుతుందని సూచించారు. ఈ తెగుళ్ల ఉధృతి గమనించిన వెంటనే కార్బన్ డిజమ్ 200 గ్రాములు ఎకరాకు లేదా డైనోకాప్ 200 మి.లీ ఎకరాకు అనే మందులను పిచికారి చేసుకోవాలి. రైతులు తాము సాగు చేస్తున్న పంటలపై వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో సలహాలు సూచనలు తీసుకోవాలని అన్నారు.

సాగు భూములకు రూ.12 వేల రైతు భరోసా

● పంట పండే భూములకే సాగు సాయం
● హర్షం వ్యక్తం చేస్తున్నరైతులు



పంట సాగు చేస్తున్న రైతు

మద్నూర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): రైతు భరోసా పథకం కింద రైతులకు ఏటా ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందజేస్తామని రాష్ట్ర ముఖ్య మంత్రి ప్రకటించడంతో మద్నూర్ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ అమలు చేసిన రైతు బంధు పథకంలో సాగుతో సంబంధం లేకుండా పాస్ బుక్‌లో ఉన్న అన్ని రకాల భూములకు సాగు సాయం అందించారు. దాంతో విలువైన ప్రజా ధనం వృథా అయిందని కాంగ్రెస్ ప్రభుత్వం విమర్శించింది. గతంలో సాగు భూములతో పాటు సాగులు లేని భూములు, కొండలు, కలిగి ఉన్నాయి. కొన్ని భూముల పాస్ పుస్తకాలు, రెవెన్యూ రికార్డుల్లో ఉన్న వాస్తవానికి ఆయా రైతులకు వాస్తవంగా ఆ భూముల్లేవు. ఇలాంటి పరిస్థితుల్లో గత ప్రభుత్వం ధరణి ఆధారంగా రైతు బంధు అమలు చేయడంతో వేల కోట్ల నిధులు వృథా అయినట్లు ఆరోపణలు వచ్చాయి. సాగు భూమి లేకపోయినా రైతుగా భావించి ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతు బంధు అందించారనే ఆరోపణలు ఉన్నాయి. అలా కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.12 వేల చొప్పున పెట్టుబడి సాయం అందజేస్తామని ప్రకటించింది.

● రైతు భరోసాలో మార్పులు

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు బంధు పథకాన్ని రైతు భరోసాగా సాయం అందించేందుకు సిద్ధమైంది. రూ.12 వేల సాగు సాయంలో భాగంగా జనవరి 26 నుంచి అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అదేవిధంగా భూమి లేని వ్యవసాయ కుటుంబాలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏటా రూ.12 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తామని సీఎం ప్రకటించారు. దాంతో పాటు రేషన్ కార్డులు లేని వారందరికీ నూతన రేషన్‌కార్డులు ఇస్తామని ప్రకటించారు.

ప్రధాన రహదారి పక్కనే వ్యర్థాలు

● దుర్వాసనతో ముక్కు మూసుకుంటున్న జనం
● ఎల్లారెడ్డిలో వ్యర్థాలను రోడ్డు పక్కనే పారబోస్తున్న చికెన్ సెంటర్ నిర్వాహకులు
● పట్టించుకోని మున్సిపల్ అధికారులు

ఎల్లారెడ్డి, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి పట్టణ శివారులోని బాన్సువాడ ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కన సోమార్‌పేట్ వెళ్లే రోడ్డు పక్కన వ్యర్థాలు పారబోయడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో వాహన దారులు, ప్రజలు ఉదయం వాకింగ్ వెళ్లే వారు, అటువైపు ఆదర్శ పాఠశాల కూడా ఉండడంతో ప్రతీ రోజు విద్యార్థులు ప్రజలు దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీకి 1406 సర్వే నంబర్ డంపింగ్ యార్డు ఉన్నప్పటికీ మున్సిపల్ కార్మికులు రోడ్డు పక్కన వేసి చేతులు దులుపుకుంటున్నారు. అంతేకాకుండా చికెన్ సెంటర్ నిర్వాహకులు సైతం వ్యర్థాలను ప్రధాన రహదారి పక్కనే పోయడంతో వీధి కుక్కలు అటువైపు గుంపులుగా ఏర్పడి రోడ్డుపై వెళ్లే వాహనదారులపై, బాట సారులు వెళ్లే వారిపై దాడికి పాల్పడుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరు బయట చెత్త వేయరాదని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చిన కొందరు పెడచెవిన పెడు తున్నారే అనే విమర్శలు ఉన్నాయి. మున్సిపల్ అధికారులు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించాలని, అదేవిధంగా చికెన్ సెంటర్ నిర్వాహకులు చికెన్ వ్యర్థాలను రోడ్డు పక్కన పారబోయకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు బాటసారులు, విద్యార్థులు కోరుతున్నారు.



ఎల్లారెడ్డి ప్రధాన రహదారి పక్కనే చికెన్ వ్యర్థాలు, గుంపుగా మారిన కుక్కలు



రోడ్డు పక్కనే చెత్తను పోస్తున్న మున్సిపల్ కార్మికులు

● అధికారులు చర్యలు తీసుకోవాలి

ఉదయం 5.30 గంటలకు చాలామంది పట్టణ ప్రజలు బాన్సువాడ - ఎల్లారెడ్డి ప్రధాన రహదారి వైపు వాకింగ్ కోసం వెళుతుంటారు. తర్వాత విద్యార్థులు పాఠశాలల సమయానికి అటువైపు బాటసారులు సైతం ఎక్కువ ఎక్కువగా రాకపోకలు సాగుతుంటాయి చికెన్ వ్యర్థాలకు వీధి కుక్కలు గుంపులుగా ఏర్పడి బాటసారులపై దాడికి పాల్పడుతున్నాయి అంతేకాకుండా దుర్వాసన వెదజల్లుతోంది అధికారులు తగిన చర్యలు తీసుకొని రోడ్డు వైపు వేయకుండా చూడాలి.

- వెంకటేశం, స్థానికుడు ఎల్లారెడ్డి



చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పెండింగ్ బిల్లులను చెల్లించాలి

సదాశివనగర్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ బిల్లులు చెల్లించి విజయడెయిరీకి పూర్వవైభవం తీసుకురావాలని జిల్లా అధ్యక్షుడు చింత కుంట తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం రాష్ట్ర పాడిపరిశ్రమ అభివృద్ధి చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై వినతి పత్రం అందించారు. పాడిపరిశ్రమలో ప్రభుత్వ అనుబంధ సంస్థగా పేరు ఉన్న విజయడెయిరీ గ్రామాలలో ప్రైవేట్ డెయిరీల కంటే 10 రూపాయలు లీటర్‌కు అధికంగా చెల్లిస్తున్నప్పటికీ ప్రైవేట్ డెయిరీలను నమ్మి రైతులు మోసపోకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. కార్యక్రమంలో నరసింహరెడ్డి, కిష్టారెడ్డి, రాజేశ్వర్‌రావు తదితర గ్రామాల పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు.

రవాణా శాఖ కార్యాలయంలో హెల్త్‌క్యాంపు



కంటి పరీక్ష చేయించుకుంటున్న అధికారి శ్రీనివాస్‌రెడ్డి

కామారెడ్డిటౌన్, జనవరి 6(ఆంధ్రజ్యోతి):రోడ్డుభద్రత మసోత్సవాల సందర్భంగా సోమవారం కామారెడ్డి జిల్లా రవాణశాఖ కార్యాలయంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్‌టీఓ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ రోడ్డు భద్రత మసోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. ఉద్యోగులకు ఉచిత కంటి పరీక్షతో పాటు రక్తదానశిబిరం ఏర్పాటుచేశామని తెలిపారు. పెద్ద ఎత్తున రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తాన్ని అందించి మరో ప్రాణం కాపాడేందుకు కృషిచేసిన ప్రతి ఒక ఉద్యోగిని అభినందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్‌లు తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయానికి విద్యుత్ సదుపాయం

సదాశివనగర్,జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోనూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం వద్ద విద్యుత్ సదుపాయంకోసం ఎమ్మెల్యే మదన్మోహన్‌రావుకు విన్నవించగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేయించినట్లు మాజీ వైస్ ఎంపీపీ గాదరి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయం వద్ద విద్యుత్ సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విద్యుత్ సదుపాయం కల్పించినందుకు అయ్యప్ప భక్తులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో వడ్ల రాజేందర్, మద్దెల భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

'అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం'

భిక్కనూరు, జనవరి6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు తిర్మల్ స్వామి, మాజీ సింగిల్ విండో చైర్మన్ పల్లెర్ల సంతోష్ అన్నారు. మండలకేంద్రంలో వారు మాట్లాడుతూ ఈ నెల 26 నుండి రైతులకు రైతు భరోస కింద రూ.12వేలు, భూమిలేని వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోస కింద రూ.12వేలు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నేరవేర్చడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

గాంధారి, జనవరి 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతాయిపల్లి, చెన్నాపూర్ గ్రామశివారు పరిధిలోని అటవీ ప్రాంతంలో సోమవారం ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. ఫారెస్ట్ బీట్ అధికారి బిలాల్‌వార్ రవి ఫారెస్ట్‌లో తిరుగుతుండగా చెట్టుకు వేళాడుతున్న మృతదేహం కనిపించడంతో సమాచారం అందించారని తెలిపారు. భవానిపేట రోడ్డుకు అరకిలోమీటర్ లోపల అటవీలో బామన్ కుంట ఎత్తుగడ్డపైన చెట్టుకు మధ్యలో నైలాన్ తాడుతో ఉరివేసుకుని కుళ్లిన స్థితిలో శవం లభ్యమైందని తెలిపారు. సుమారు 20 నుంచి 25 రోజుల కింద చనిపోయినట్లు గుర్తించామని తెలిపారు. ఎవరైనా మగ వ్యక్తి మిస్సింగ్ కేసు ఉంటే గాంధారి పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని ఎస్సై తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యతగా చేపట్టాలి

ఎల్లారెడ్డి, జనవరి6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మాపూర్‌లో సోమవా రం ఉపాధిహామీ రూ.5లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచిం చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సామెల్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ సాయిలు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఎన్నిక

దోమకొండ, జనవరి 6(ఆంధ్రజ్యోతి): దోమకొండ మండల ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా గోసనిపల్లి శివలింగం, అధికార ప్రతినిధి నత్తి గణేష్, ఉపాధ్యక్షులు నర్సింలు, కార్యదర్శి స్వామి, శ్రీనివాస్, రంజిత్, రవీందర్‌లను ఎన్నుకున్నారు.కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పాఠశాల విద్యార్థులకు షూ అందజేత

కామారెడ్డిటౌన్,జనవరి 6(ఆంధ్రజ్యోతి): కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు భారతీ శ్రీవారి ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో షూను అందించారు.ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టిసారించి ఉన్నత స్థానాలకు ఎదగాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు అన్నిరకాల సౌకర్యాలను కల్పిస్తుందని మధ్యాహ్నభోజనంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉపాధ్యాయులు చూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ భారతీ శ్రీవారి,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగాకిషన్, ఉపాధ్యాయులు జంగం శ్రీశైలం, శ్రీనివాస్,సాయిలు, కరుణ,మానస, సుష్మతదితరులు పాల్గొన్నారు.

పెద్దకొడప్‌గల్‌లో రక్తదాన శిబిరం

పెద్దకొడప్‌గల్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం నరేంద్ర మహరాజ్ జన్మదినాన్ని పురస్కరించని భక్తులు రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సంస్థాన్ కామారెడ్డి జిల్లా ఇన్‌చార్జి సుశీల్ పాటిల్ మాట్లాడుతూ స్వామి వారి జన్మదినాన్ని పురస్కరించుకుని దేశ వ్యాప్తంగా మత సంస్థాన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. శిబిరంలో 47 మంది భక్తులు రక్తదానంను చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థాన్ బాధ్యులు వీరశెట్టిబాబా, మనోహర్ పాటిల్, బాబురావ్, మాజీ ఎమ్మెల్యే గంగరాం, నాయకులు ప్రతాప్ రెడ్డి, మహేందర్ రెడ్డిలతో పాటు, బిజెపి, భజరంగ్‌దళ్ కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళాశక్తి పథకం ద్వారా ఆర్థికంగా ఎదగాలి

● కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్



సంచార చేపల విక్రయ వాహనాన్ని లబ్ధిదారుకు అందిస్తున్న కలెక్టర్

కామారెడ్డిటౌన్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): ఇందిరా మహిళాశక్తి (ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం) కింద మంజూరైన యూనిట్ స్థాపించి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సంచార చేపల అమ్మకం వాహనంను కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకంకింద రూ.10లక్షలతో సంచార చేపల అమ్మకం వాహనం గాంధారి మండల స్వయం సహాయక సంఘ సభ్యురాలు తేజావత్ లతకు మంజూరు చేశామని తెలిపారు. ఇందులో 4లక్షలు సభ్యురాలు వాటా కాగా, 6లక్షలు సబ్సిడి మంజూరుచేయడం జరిగిందని తెలిపారు. సంచార చేపల అమ్మకం వ్యాపారం నిమిత్తం శిక్షణలో 5 రోజులపాటు సభ్యురాలికి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఈ వ్యాపారంలో మంచి రుచిగల కొత్త వంటకాలు తయారుచేసి వ్యాపారాలు చేయాలని తెలిపారు. చేపల సరఫరా కోసం మత్స్యశాఖాధికారులు సహకారం పొందాలని, చేపల సరఫరాచేసే వారితో టైఅప్ చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, మత్స్యశాఖాధికారి శ్రీపతి, డీఆర్‌డీఓపీడీ సురేందర్ ఉన్నారు.

జిల్లాలో రూ.6,90,317 మంది ఓటర్లు

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సోమవారం ఫైనల్ ఎలక్టోరల్ ఓటర్ జాబితాను ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 6 లక్షల 90వేల 317మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో 3,33,070మంది పురుషులు, 3,57,215మంది స్త్రీలు, 32మంది ఇతరులున్నారు. జుక్కల్ 2,06,402 మంది ఓటర్లు, ఎల్లారెడ్డిలో 2,25,858 మంది ఓటర్లు, కామారెడ్డి 2,58,057 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. అదేవిధంగా 600 మంది సర్వీస్ ఎలక్టర్స్ ఉన్నారని వివరించారు.

బస్వాపూర్ పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో చోరీ

● బంగారు, వెండి వస్తువులు, హుండీ డబ్బులను ఎత్తుకెళ్లిన దుండగులు



ఆలయం గేటు తాళాన్ని పగులగొట్టిన దృశ్యం

భిక్కనూరు, జనవరి 6(ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో 44వ జాతీయరహదారి పక్కన గల శ్రీ పెద్దమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో సోమవారం తెల్లవారుజామున చోరీ జరి నట్లు భిక్కనూరు ఎస్సై రాంచందర్‌నాయక్ తెలిపారు. పోలీసులు, గ్రామ ముదిరాజ్, గౌడసంఘం సంఘం స భ్యుల కథనం ప్రకారం.. పెద్దమ్మ ఆలయ గేట్‌ను ధ్వంసం చేసి లోనికి ప్రవేశించిన దొంగలు అమ్మవారి ముక్కుపుడుక, పుస్తే, మట్టేలలను, ఎల్లమ్మ ఆలయంలో హుండీని ధ్వంసం చేసి అందులోని డబ్బులను ఎత్తి కెళ్లినట్లు తెలిపారు. ముదిరాజ్, గౌడ సంఘం సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా ఇటీవల భిక్కనూరు మండలంలో దొంగతనాలు ఎక్కువయ్యాయి. బస్వాపూర్ గ్రామంలో గత 15 రోజుల క్రితం ఆరుగురు ముసుగు ధరించిన దొంగలు పెద్దపెద్ద కట్టర్‌లు, మరణాయుధాలు ధరించి సంచరించినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి.

సీఐటీయూ జెండా ఆవిష్కరణ

దోమకొండ, జనవరి 6 (ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని పాత బస్టాండ్ చౌరస్తా వద్ద సోమవారం అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్ట్ ప్రధాన కార్యదర్శి ఎస్. బాబాయి మాట్లాడుతూ సీఐటీయు దేశ వ్యాప్త జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో భాగంగా దోమకొండ మండల కేంద్రంలో దోమకొండ, బీబీపేట, బిక్కనూర్, రాజంపేట, మాచారెడ్డి మండలాలకు చెందిన టీచర్లు కలసి ఆవిష్కరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో యాదమ్మ, పి. రాణి, లక్ష్మీ, విజయ, సంతోషి, విజయ, సురేఖ, కవిత, లక్ష్మీ, ఐదు మండలాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో కోఆపరేటివ్ బ్యాంక్ ఏటీఎం

గాంధారి, జనవరి 6(ఆంధ్రజ్యోతి):కోఆపరేటివ్ బ్యాంక్ ఏటీఎం సేవలు ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమని డీసీసీబీ జిల్లా డైరెక్టర్ సాయికుమార్ తెలిపారు. సోమవారంగాంధారి బ్రాంచ్ ఏటీఎం సేవలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇబ్బందులు లేకుండా ఏటీఎం సేవలు అందుబాటులో ఉంచామని ఖాతాదారులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంకు ఏజీఎం భీంరావు, బ్యాంకు మేనేజర్ శ్రీపాల్‌రెడ్డి, సొసైటి కార్యదర్శి సాయిలు, వైస్ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాలను ధ్వంసం చేయిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్

నిషేధిత మత్తు పదార్థాల ధ్వంసం

కామారెడ్డి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ స్టేషన్‌లలో ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం నమోదైన 71 కేసులో పట్టుబడిన నిషేధిత మత్తు పదార్థాలను ధ్వంసం చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెడెంట్ హన్మంత్‌రావు తెలిపారు. గంజాయి,అల్ప్రజోలం, డైజోఫామ్, గంజాయి మొక్కలు జక్రాన్‌పల్లి మండలం పడకల్ గ్రామంలో గల శ్రీమెడికేర్ సర్వీసెస్ కెమికల్ ఫ్యాక్టరీలో ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఈ నిషేధిత మత్తుపదార్థాల్లో 1285.25 కేజీల ఎండు గంజాయి, 32.585 కేజీల అల్ప్రజోలం, 71.845 కేజీల డైజోఫామ్, 114 గంజాయి మొక్కలు ధ్వంసం చేశామని తెలిపారు. వీటి విలువ సుమారు రూ.7కోట్ల 98లక్షల 70వేల 250 ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ లు విజయ్‌కుమార్, మధుసూదన్‌రావు, షాకీర్ హైమద్, సత్యనారాయణ, ఎస్ఐ విక్రమ్, నగేష్ సిబ్బంది పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలను తరలించొద్దు

● డిప్యూటీ తహసీల్దార్‌కు బీఆర్ఎస్ నేతల వినతి

నాగిరెడ్డిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్ తుమ్మెద వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను తరలించొద్దని మండల బీఆర్ఎస్ పార్టీ నేతలు స్థానిక డిప్యూటీ తహసీల్దార్ రాజేశ్వర్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. స్థానిక మాజీ జడ్పిటిసి మనోహర్ రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సిద్దయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి డిప్యూటీ తహసిల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కామారెడ్డి జిల్లాలోని నాగిరెడ్డి పేట మండలంలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేశారని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలకు కోట్లాది రూపాయలు వెచ్చించి అధునాతన భవనాన్ని నిర్మింపజేశారన్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందన్న సాకుతో ఈ పాలిటెక్నిక్ కళాశాలను తరలించేందుకు ప్రయత్నిస్తున్నారని ఈ ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని అన్నారు. కళాశాలను ఇక్కడి నుంచి ఇతర చోటికి తరలింపు చేస్తే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సిద్దయ్య, నాయకులు మంగలి యాదగిరి, హనుమంత్ రెడ్డి, ఫరీద్, లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు

ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

● మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్



ఎల్లారెడ్డిలో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డి,జనవరి6 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ అన్నారు. సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు రైతులకు రైతు బంధు 15 వేలు ఇస్తామని చెప్పి ప్రస్తుతం రూ.12వేలు ఇస్తామని ప్రకటించడంపై మండిపడ్డారు. అదేవిధంగా రైతులకు ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఆంక్షలు విధిస్తూ రుణ మాఫీ చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తుందని, త్వరలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో రైతులు ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎల్లారెడ్డి మండల అధ్య క్షుడు జలంధర్‌రెడ్డి, వివిధ మండలాల అధ్య క్షులు, ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు ఆదిమూలం సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి కల్పన'లో అవకతవకలు

(5వ పేజీ తరువాయి)

సిబ్బందికి చెందిన సన్నిహితులు,బంధువులు కావడం గమనార్హం.ఈ పోస్టులను అక్కడ పనిచేసి ప్రస్తుతం బదిలీపై వెళ్లిన అధికారి ద్వారానే నింపారని తెలుస్తుంది. వీటన్నింటిపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపితే ఎంతపెద్ద అవినీతి,అవకతవకలు జరిగాయే బట్టబయలు అయ్యే అవకాశం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

అవకతవకలపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్

కామారెడ్డి టౌన్, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కల్పనశాఖలో జరుగుతున్న అవకతవకలు, అవినీతిపై విచారణ జరపాలని బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్ అన్నారు. సోమవారం కలెక్టర్ ఆశీష్ సాంగ్వాన్‌కు ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. జిల్లా ఉపాధికల్పనశాఖ కార్యాలయంలో పనిచేస్తున్న జిల్లా అధికారితోపాటు పలువురు సిబ్బంది ఉద్యోగ నియామకాలలో అవకతవకలకు పాల్పడుతున్నారని అన్నారు. ఉపాధిశాఖ కార్యాలయ అధికారి మధ్యవర్తులను పెట్టుకుని ఉద్యోగ నియామకాలలో పెద్దఎత్తున డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. గత ఐదు నెలల క్రితం ఏజెన్సీల కేటాయింపుల్లో ఏజెన్సీల ద్వారా వస్తు, ఆభరణాలు, నగదు రూపేనా డబ్బులు వసూలు చేశారని పలు ఏజెన్సీల నిర్వాహకులే చెబుతున్నారని తెలిపారు. అలాగే 'ఆంధ్రజ్యోతి'లో 'కార్మికుల కష్టార్జితం కాంట్రాక్టర్‌ల జేబుల్లోకి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనంలో వాస్తవాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉపాధి శాఖ కార్యాలయంలో ఏజెన్సీల కేటాయింపులో జరిగిన అవకతవకలు, మూడేళ్లుగా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో జరిగిన ఉద్యోగ నియామకాల ప్రక్రియలపై విచారణ జరిపి ఆయాసిబ్బందిపై చర్యలు తీసుకోవాలని లేదంటే పెద్దఎత్తున నిరుద్యోగులతో కలిసి ఉద్యమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీవీఎం నాయకులు పాల్గొన్నారు.



లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే

బాధితులకు అండగా సీఎంఆర్ఎఫ్: ఎమ్మెల్యే

మద్నూర్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): అత్యవసర సమయాల్లో పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. సోమవారం మండలకేంద్రంలోని మార్కెట్ యార్డులో బాధిత కుటుంబాలకు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర సమయాలలో కార్పొరేట్ ఆసుపత్రులకు వెళ్లి చికిత్స పొందిన అనంతరం తగిన డాక్యుమెంట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేసిన బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి నిధులు మంజూరు అవుతాయని చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ సౌజన్య రమేష్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సాయిలు, ఆత్మ కమిటీ చైర్మన్ గంగాధర్, సీనియర్ నాయకులు హనుమాన్లు స్వామి, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, మాజీ ఎంపీటీసీ గడ్డం లక్ష్మణ్, నాయకులు ఉన్నారు.

ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలి

నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల్లో విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చే యాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో తెలంగాణ ఉపాధ్యాయ సంఘం 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. చదువులో వెనుకబడి ఉన్న జుక్కల్ నియోజక వర్గాన్ని మొదటిస్థానంలో నిలపాలన్నారు. కార్యక్రమంలో టీయూపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివకాంత్, మండల నాయకులు పండరి, మైనార్టీ పాఠశాల హెచ్ఎం మల్లేశం తదితరులున్నారు.

రెండో తరగతి విద్యార్థిని చితకబాదిన టీచర్

● పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు.. టీచర్‌పై కేసు నమోదు



టీచర్ కొట్టిన దెబ్బలకు విద్యార్థి చేతిపై పడిన వాతలు

నాగిరెడ్డిపేట, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గోపాల్‌పేట్‌లో గల కేరళ ప్రైవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఓ విద్యార్థి పరీక్ష సరిగ్గా రాయలేదన్న కారణంగా పాఠశాల టీచర్ విద్యార్థికి వాతలు వచ్చేలా చితకబాదిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నాగిరెడ్డిపేట గ్రామానికి చెందిన మేకల నర్సింలు, మానస దంపతుల ఏడేళ్ల కుమారుడు రిత్విక్ మండల కేంద్రంలోని గోపాల్‌పేట్‌లో గల కేరళ పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. అయితే ఈ విద్యార్థికి సంబంధించిన ఫీజు చెల్లించమని పాఠశాల ప్రిన్సిపాల్ నిర్మల జిమ్మీ విద్యార్థి తండ్రికి ఫోన్ చేశారని, దీంతో ఫీజు చెల్లించడానికి తండ్రి నర్సింలు శనివారం పాఠశాలకు వెళ్లాడు. పాఠశాలలో ప్రిన్సిపాల్ లేకపోవడంతో ఆమెకు ఫోన్ చేశారు. ఫీజు రేపు చెల్లించమని ప్రిన్సిపాల్ ఫోన్‌లో చెప్పడంతో కుమారుడిని పాఠశాలలో వదిలేసి తండ్రి ఇంటికి వెళ్లినట్టు ఆయన తెలిపారు. అయితే టీచర్ జూలీ శనివారం విద్యార్థులకు పరీక్షలు నిర్వహించిందని, రుత్విక్ పరీక్ష సరిగ్గా రాయలేదనే కారణంతో విద్యార్థి రుత్విక్‌ను బెత్తంతో జూలీ కొట్టిందన్నారు. టీచర్ కొట్టిన దెబ్బలకు విద్యార్థి ఒంటిపై వాతలు పడ్డాయి. దీంతో విద్యార్థి సాయంత్రం ఇంటికి వెళ్లాక తల్లిదండ్రులకు విషయం చెప్పడంతో తల్లిదండ్రులు ఆదివారం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు. విద్యార్థి తండ్రి నర్సింలు ఫిర్యాదు మేరకు టీచర్ జూలిపై, పాఠశాల యాజమాన్యంపై కేసునమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. చికిత్స నిమిత్తం విద్యార్థిని ఎల్లారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఆయన తెలిపారు.

గ్రామసంఘాల విధులు, నిబంధనలపై వీవోఏలకు శిక్షణ

బీర్కూర్, జనవరి6(ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల సమాఖ్యలో సోమవారం వీవోఏలకు సోమవారం గ్రామ సంఘాల ఉప విధులు, నిబంధనావళిపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామసంఘంలో సభ్యత్వం, పొదుపులు, ఆడిట్ నిర్వహణ, 1995 పరస్పర సహకార చట్టం, పాలక వర్గం విధులు, బాధ్యతలు తదితర అంశాలపైన ఏపీఎం గంగాధర్ శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీసీలు, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నిజాంసాగర్, జనవరి6 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో మోడల్ స్కూల్ అచ్చంపేట్‌లో అడ్మిషన్లు పొందేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.కార్తీక సంధ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026 సంవత్సరానికి 6 నుంచి 10వ తరగతి అడ్మిషన్ల కోసం జనవరి 6 నుంచి ఫిబ్రవరి 28 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తుల కోసం వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు రూ.125, ఇతర విద్యార్థులకు రూ.200 ఆన్‌లైన్ పరీక్ష ఫీజు చెల్లించాలని సూచించారు. పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో ఏప్రిల్ 3వ తేది నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

పెద్దకొడప్‌గల్, జనవరి6(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశానికి 2025-26 సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదల చేసినట్లు గురుకుల పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సునీత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశాలకు ప్రస్తుతం 4వ తరగతి చదివే విద్యార్థులు అర్హులని తెలిపారు. దీంతోపాటు బ్యాక్‌లాగ్ 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం కూడా దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులను విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ దరఖాస్తు చేసుకునే సమయంలో ఏమైనా సందేహాలుంటే తమ పాఠశాలలో హెల్ప్‌లైన్ డెస్క్‌కేంద్రం ఏర్పాటు చేశామని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ దరఖాస్తులను ఫిబ్రవరి 02 వరకు ఆఖరి తేది ఉంటుందని దీనిని దరఖాస్తులు గమనించాలని సూచించారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

శాంతి - రోటి కప్డా రోమాన్స్
దర్శన్ - యూఐ
ప్రియా 70 - పుష్ప-2
ప్రియా 35 - మ్యాక్స్

బాన్సువాడ

మహేశ్వరి - పుష్ప-2
వెంకటేశ్వర - మ్యాక్స్

చికెన్ ధరలు



రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	120	140	160
వెన్‌కాబ్(కిలో)	130	160	190

